

**బిల్లులకు మోక్షం ఎప్పుడో ?**

సంక్షేమ శాఖల వసతిగృహాలకు నెలల తరబడి డైట్ బిల్లులు మంజూరు కాక బకాయిలు రూ.11కోట్లకు పైగా పేరుకుపోయాయి. 10లో



**కొబ్బరికాయల ధరలకు రెక్కలు!**

దేవీ నవరాత్రులు, ఇతర పూజలు సాగుతున్న వేళ కొబ్బరికాయల ధర పెరగడంతో భక్తులపై భారం పడుతోంది. 10లో

గరిష్టం / కనిష్టం 32° / 24°

**వాతావరణం**

జిల్లాలో ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సమయాన ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### శ్రీదుర్గాదేవిగా అమ్మవారి దర్శనం



ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజైన మంగళవారం వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజామునే స్వామి మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేసిన అర్చకులు యాగశాలలోని అమ్మవారిని శ్రీదుర్గాదేవి రూపంలో అలంకరించారు. ఆపై చండీ హోమం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా పశువైద్యాధికారిగా డాక్టర్ శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బోడేపూడి పురంధర్ నాలుగు నెలల పాటు వ్యక్తిగత సెలవులో వెళ్లారు. దీంతో జిల్లా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బోడేపూడి శ్రీనివాస్‌రావుకు జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు రాష్ట్ర శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శ్రీనివాసరావు వచ్చే ఏడాది జనవరి 29వరకు జిల్లా అధికారిగా వ్యవహరిస్తారు.

### పులిగుండాలలో ప్లాస్టిక్‌పై నిషేధం



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న ఎఫ్‌డీఓ మంజుల

సత్తుపల్లి: పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాంతాన్ని ఎకో టూరిజం విభాగంలో అభివృద్ధి చేయగా, ఈ ప్రాంతంలో ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలోని కార్యాలయంలో ఆమె అటవీశాఖ ఆధ్వర్యాన రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ స్టిక్కర్లను విడుదల చేసి మాట్లాడారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకుని గాజు బాటిళ్లు అందిస్తామని తెలిపారు. ఈ విషయంలో పర్యాటకులు సహకరించాలని సూచించారు. ఎఫ్ఎస్ఓ పి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

### కోట మైసమ్మ జాతరకు భారీ బందోబస్తు



జాతర ప్రాంగణంలో పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కారేపల్లి: దసరా సందర్భంగా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో జరిగే శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర ప్రాంగణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు డీసీపీ ప్రసాదరావు తెలిపారు. జాతర ప్రాంగణాన్ని మంగళవారం ఆయన ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈనెల 2నుంచి 7వ తేదీ వరకు జరగనుండగా ఇద్దరు సీఐలు, పది మంది ఎస్‌లతో పాటు, 100మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఉంటుందని తెలిపారు. వేలాదిగా భక్తులు తరలిరానున్నందున ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇదేసమయాన ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ బి.గోపి, ఆలయ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, పర్సా సాయిలలిత్ తదితరులు పాల్గొన్నారు.

### 'పాలం బాట'తో సమస్యల పరిష్కారం

ఖమ్మంవ్యవసాయం: రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే కాక సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న 'విద్యుత్ అధికారుల పొలంబాట' కొనసాగుతోందని ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించామని పేర్కొన్నారు. ఈమేరకు 447 లూజ్ లైన్లు, 226 వంగిన స్తంభాలను సరిచేయగా, 374 చోట్ల మధ్య స్తంభాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్ సిబ్బందిని సంప్రదించేందుకు 24 గంటల పాటు అందుబాటులో ఉండే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఈ సూచించారు.

# రిజర్వేషన్.. పరేషాన్

**కొన్ని రిజర్వ్‌డ్ స్థానాల్లో ఆ కేటగిరీ అభ్యర్థులు కరువు**

- ఇంకొన్ని చోట్ల ఒకరు, ఇద్దరే అభ్యర్థులు
- ఎక్కువ ఎస్టీ జనాభా ఉన్న జీపీలు సైతం బీసీలకు రిజర్వ్
- మార్పులు చేయాలని కలెక్టర్, ఆర్డీఓలకు వినతులు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలుచేస్తున్న రిజర్వేషన్లతో ఆశావహులు పోటీ చేసే అవకాశం కోల్పోతుండగా.. ఆయా కేటగిరీ అభ్యర్థుల కోసం రాజకీయ పార్టీలు అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొంది.గ్రామ పంచాయతీలకు సంబంధించి కొన్నిచోట్ల అభ్యర్థులే కరువయ్యేలా కనిపిస్తోంది. అలాగే చాలా పంచాయతీల్లో రిజర్వ్ కేటగిరిలో ఒకటి, రెండు కుటుంబాలే ఉన్నాయి. ఈ నేపథ్యాన పార్టీలు బలంగా ఉన్నా.. అభ్యర్థులు లేక పోవడం తలనొప్పి తెచ్చి పెట్టేలా కనిపిస్తోంది. ఈ కారణంగా చాలా గ్రామపంచాయతీల్లో ఏకగ్రీవాలు అనివార్యంగా మారనున్నాయి.

**ఆశలపై నీళ్లు**

సర్పంచ్, వార్డు సభ్యులుగా బరిలో ఉండాలనే ఆసక్తితో గ్రామీణ ప్రాంతాల్లో పలువురు దశాబ్దాలుగా రాజకీయం చేస్తున్నారు. కానీ రిజర్వేషన్ల వ్యవహారం వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఇదే సమయాన రాజకీయాలతో సంబంధం లేకుండా ఇతర పనులు చేసుకుంటున్న వారికి కలిసొస్తోంది. చాలా గ్రామాల్లో రిజర్వ్ స్థానాల్లో ఒకరు, ఇద్దరు మాత్రమే ఆ కేటగిరీ అభ్యర్థులు ఉన్నారు. దీంతో వారే సర్పంచ్, వార్డు సభ్యులుగా ఎన్నిక కావడం లాంఛనంగా మారనుంది. ఇక బీసీలకు రిజర్వ్ అయిన గ్రామపంచాయతీల్లో బీసీ అభ్యర్థి దొరకని పరిస్థితి నెలకొనడం.. గిరిజనులు ఎక్కువగా ఉండే జీపీలు బీసీలకు, ఎస్సీలు లేని చోట్ల ఎస్సీలకు రిజర్వ్ కావడం గమనార్హం.

**ఎందుకిలా..**

రిజర్వేషన్లతో కొన్ని గ్రామపంచాయతీల్లో నెలకొన్న అయోమయ పరిస్థితిపై రాజకీయ పార్టీలు ఆలోచనలో పడ్డాయి. ఆయా పంచాయతీల్లో రిజర్వేషన్‌కు తగినట్లుగా అభ్యర్థులు అందుబాటులో లేరు. కొన్ని గ్రామాల్లో రిజర్వ్ కేటగిరీలో ఒకరిద్దరే అర్హులు ఉండడంతో వారిని ఆకర్షించేందుకు నాయకులు తంటాలు పడుతున్నారు. సర్పంచ్ ఎన్నికలకు 2018 జనాభా లెక్కలు, బీసీ రిజర్వేషన్ల కోసం 2024 కుల గణనను పరిగణనలోకి తీసుకోవడంతో కొన్నిచోట్ల ఇలా జరిగిందనే చర్చ సాగుతోంది. అయితే నిబంధనల మేరకే రిజర్వేషన్లు చేసినందున మార్చడం కుదరదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయినా రిజర్వ్ కేటగిరీ జనాభా తమ జీపీల్లో అతి తక్కువగా ఉన్నందున రిజర్వేషన్లు మార్చాలని కొందరు ఇటీవల కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేశారు.

**ఈ మండలాల్లో ఇలా ..**

→ **చింతకాని మండలం** రాఘవాపురం సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. గ్రామంలో మొత్తం 471 మంది ఓటర్లకు ఒకే ఎస్సీ కుటుంబం ఉంది. ఆ కుటుంబంలో కాంపల్లి కోటమ్మ, ఆమె కుమారుడు దావీదు ఉండడంతో సర్పంచ్‌గా కోటమ్మ ఏకగ్రీవం కానుంది. ఇక నాలుగో వార్డు ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కాగా దావీదు ఏకగ్రీవంగా ఎన్నికవడం ఖాయమే. ఫలితంగా తల్లీకొడుకులు సర్పంచ్, వార్డు సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

→ **కూసుమంచి మండలం** ధర్మాతండా బీసీ జనరల్‌కు రిజర్వ్ కాగా అక్కడ కుమ్మరికుంట్ల నాగరాజు - శ్రావణి ఇద్దరే బీసీ ఓటర్లు. వీరిది పక్కనే కేశ్వాపురమైనా తండా వద్ద కోళ్ల ఫారం పెట్టుకుని ఇక్కడే ఓటు హక్కు పొందారు. ఇక మంగలి తండా బీసీ మహిళకు రిజర్వ్ కాగా ఆ తండా యువకుడు బీసీ యువతి అనితను వివాహం చేసుకోవడంతో ఆమెకు ఓటు వచ్చింది. ఇదే తండాకు చెందిన మరో యువకుడు బీసీ మైనార్టీ యువతిని వివాహం చేసుకున్న ఆమెకు ఓటు లేకపోవడంతో అనిత ఏకగ్రీవమయ్యే అవకాశముంది. ఇదే మండలం లాల్‌సింగ్ తండా సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కాగా అక్కడ ఒకే బీసీ కుటుంబం నుంచి అత్తాకోడళ్లలో ఒకరికి అవకాశముంది. అజ్మీరా హీరామాన్ తండా బీసీ మహిళకు రిజర్వ్ అయితే అక్కడా ఒకే బీసీ కుటుంబం ఉన్నందున ఏకగ్రీవం కానుంది. అయితే, మంగలితండా, హీరామాన్ తండాల్లో ఇద్దరు యువకులు బీసీ యువతులను వివాహం చేసుకున్నా వారికి వేరే చోట ఓటు ఉంది. నామినేషన్ సమయానికి ఇక్కడకు మారితే పోటీ జరగొచ్చు. ఈనేపథ్యాన ధర్మాతండా, లాల్‌సింగ్ తండా, మంగలితండాలో రిజర్వేషన్ మార్చాలని స్థానికులు కలెక్టర్, ఆర్డీఓను కోరారు.

→ **ఏన్కూరు మండలం** షెడ్యూల్ ఏరియా కావడంతో అన్ని సర్పంచ్ పదవులు ఎస్టీలకు రిజర్వ్ అవుతున్నాయి. నూకాలంపాడులో 1,046మంది ఓటర్లకు ఒక్క ఎస్టీ కూడా లేరు. కానీ సర్పంచ్ పదవి ఎస్టీ మహిళలకు రిజర్వ్ అయింది. అంతేకాక 1, 2, 3, 4వ వార్డులూ ఎస్టీలకు రిజర్వు కావడంతో ఎన్నిక జరిగే అవకాశం లేదు. దీంతో మిగిలిన నాలుగు వార్డులకు ఎన్నికలు నిర్వహించిన విజేతల్లో ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుని పంచాయతీ పాలన సాగిస్తారు.

→ **పెనుబల్లి మండలం** గౌరారం సర్పంచ్ పదవితో పాటు నాలుగు వార్డులు ఎస్టీలకు కేటాయించారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీకి ఇద్దరికే అర్హత ఉంది. దీంతో ఇద్దరూ సర్పంచ్ పదవికి సిద్ధమవుతుండగా నాలుగు వార్డులకు ఎన్నిక జరిగే అవకాశం లేదు.

→ **రఘునాథపాలెం మండలం**లోని ఎన్.వీ.బంజర, రాములుతండా జీపీల్లో అత్యధికం ఎస్టీ ఓట్లు ఉంటే బీసీ ఓటర్లే లేరు. ఎన్.వీ.బంజర బీసీ మహిళ, రాములుతండా సర్పంచ్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. ఈ విషయాన్ని తండాల వాసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

→ **కారేపల్లి మండలం** కొత్తకమలాపురం సర్పంచ్ పదవి ఎస్టీలకు రిజర్వు చేశారు. ఇక్కడ ఎస్టీ ఓటర్లు లేకపోగా, తండా యువకులు ముగ్గురు ఎస్టీ యువతులను కులాంతర వివాహం చేసుకున్నారు. తద్వారా ముగ్గురు ఎస్టీ ఓటర్లు ఉండగా కొర్ర రమ వీఆర్ఏ ఉద్యోగం చేస్తుండడంతో పోటీకి అవకాశం లేదు. మిగిలిన వట్టం ఉమారాణి, సులోచన 2019 ఎన్నికల్లో పోటీ పడగా ఉమారాణి గెలిచింది. ఈసారి కూడా వీరిద్దరే మరోమారు పోటీ పడనున్నారు.

# బీసీలకే పెద్దపీట !

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసొచ్చిన రిజర్వేషన్లు
- పెద్దసంఖ్యలో స్థానాల్లో పోటీకి అవకాశం
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ కలిపి 309 స్థానాలు
- వార్డుసభ్యులుగా 1,474 మంది



సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అత్యధిక స్థానాల్లో పోటీ చేసే అవకాశం దక్కింది. తద్వారా ఈసారి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు స్థానాల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగనుంది. వార్డు సభ్యులు మినహా మిగిలిన స్థానాల్లో ఎక్కువగా బీసీలకే రిజర్వు అయ్యాయి. దీంతో బీసీ అభ్యర్థులను బరిలో నిలిపేలా పార్టీలు ఇప్పటి నుంచే అన్వేషణ ప్రారంభించాయి.

**కలిసొచ్చిన రిజర్వేషన్లు**

రిజర్వేషన్లు కలిసిరావడంతో ఈ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట దక్కనుంది. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులతో కలిపి జిల్లాలో బీసీలు 1,783 స్థానాల్లో పోటీకి దిగనున్నారు. గ్రామపంచాయతీల్లోని వార్డులు మినహా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లుగా వీరే అత్యధికంగా ఉంటారు. మొత్తం 5,214 వార్డుసభ్యుల స్థానాల్లో బీసీలకు 1,474 సీట్లు దక్కగా.. జనరల్ కేటగిరీలో 1,644, ఎస్టీలకు 1,161, ఎస్సీలకు 935 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. ఫలితంగా గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో పోటీ చేసే బీసీ అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇక 20 జెడ్పీటీసీ స్థానాల్లో బీసీలకు ఎనిమిది, 283 ఎంపీటీసీ స్థానాల్లో 103 బీసీలకు, 72 జనరల్‌కు, 58 ఎస్సీలకు, 50 స్థానాలు ఎస్టీలకు కేటాయించారు. అలాగే 20 ఎంపీపీ స్థానాల్లో ఎనిమిది బీసీలకు కేటాయించారు. జనరల్‌కు మూడు, ఎస్టీలకు ఐదు, ఎస్సీలకు నాలుగు రిజర్వ్ అయ్యాయి. ఇక 571 గ్రామపంచాయతీల్లో 190 సర్పంచ్ స్థానాలు బీసీలకు, 171 ఎస్టీలకు, 110 ఎస్సీలకు, 100 జనరల్‌కు ఉన్నాయి.

**బరిలో నిలిచేందుకు ఉత్సాహం**

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీసీలు ఉత్సాహంతో ఉన్నారు. పలు స్థానాలు రిజర్వ్ కావడంతో కొందరు సామాన్యులు కూడా రాజకీయ అరంగేట్రానికి అవకాశం దక్కినట్లయింది. రాజకీయ పార్టీల్లోని బీసీలు తమ ప్రాంతాల్లోనే కాకుండా రిజర్వ్ అయిన స్థానాల్లో పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఈక్రమంలో తమ వారి మద్దతు కూడగట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఫలితంగా కుల సంఘాలకు ప్రాధాన్యత పెరిగింది.

**స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వివరాలు**

| స్థానం | ఎస్టీ | ఎస్సీ | బీసీ | జనరల్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| జెడ్పీటీసీ | 04 | 04 | 08 | 04 | 20 |
| ఎంపీటీసీ | 50 | 58 | 103 | 72 | 283 |
| ఎంపీపీ | 05 | 04 | 08 | 03 | 20 |
| సర్పంచ్ | 171 | 110 | 190 | 100 | 571 |
| వార్డుసభ్యులు | 1,161 | 935 | 1,474 | 1,644 | 5,214 |
| మొత్తం | 1,391 | 1,111 | 1,783 | 1,823 | 6,108 |

# పకడ్బందీగా ఎన్నికలు

- పారదర్శకంగా రిజర్వేషన్ల ప్రక్రియ
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. జిల్లాలో రిజర్వేషన్ల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమలవుతుందని చెప్పారు. 571 గ్రామపంచాయతీలు, 5,214 వార్డుల ఎన్నికకు జిల్లాలోని 737 ఆవాసాల్లో 5,214 పోలింగ్ స్టేషన్లు గుర్తించామని తెలిపారు.

**8,02,690మంది ఓటర్లు**

ఈ ఏడాది జూలై 10వరకు నమోదైన ప్రకారం జిల్లాలో 8,02,690మంది ఓటర్లు ఉండగా... ఇందులో పురుషులు 3,88,243, మహిళలు 4,14,425, ఇతరులు 22 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నాయో, లేదో పరిశీలిస్తారని చెప్పారు. పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయిస్తామని తెలిపారు. అలాగే, మండల కేంద్రాల్లో నామినేషన్ స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు.

**అప్పీల్‌కు ఒక రోజు**

నామినేషన్ల పరిశీలన అనంతరం అప్పీల్‌కు ఒక రోజు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం నుంచే ఎంసీసీ అమల్లోకి వచ్చినందున ప్రతీఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తామని తెలిపారు. తొలుత రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్.. రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణం పూర్తయ్యేలా అందరూ సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డీఎల్‌పీఓలు రాంబాబు, విజయలక్ష్మి, డీపీఆర్వో ఎంఏ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

**అధికారుల నియామకం**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈక్రమాన జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు (ఎఫ్ఎస్‌టీ), స్టాటికల్ సర్వైలెన్స్ టీమ్(ఎస్ఎస్‌టీ)లను కలెక్టర్ అనుదీప్ నియమించారు. జోనల్ అధికారులు 40మందితో పాటు 20 ఎఫ్ఎస్‌టీ బృందాలు, 16 ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే, నోడల్ అధికారులుగా 15మందిని నియమించారు. బృందాల వారీగా సిబ్బంది నియామకం, బ్యాలెట్ బాక్స్‌ల పరిశీలన, రవాణా, శిక్షణ తదితర బాధ్యతలు అప్పగించారు.

# క్రీడల్లో జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలి



నూతన హాల్‌లో టేబుల్ టెన్నిస్ ఆడుతున్న మంత్రి తుమ్మల

**టీ.టీ.హాల్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల**



అల్లీపురంలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని.. వారి స్ఫూర్తితో యువత క్రీడారంగంలో ఎదిగి జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రూ.50లక్షల కేఎంసీ నిధులతో నిర్మించిన నూతన టేబుల్ టెన్నిస్ హాల్‌ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు అన్ని సదుపాయాలు ఉన్నందున రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని తెలిపారు. మరో క్రికెట్ స్టేడియానికి స్థలం కేటాయించినందున ప్రభుత్వానికి సమర్పించేలా నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, వీ.సాంబమూర్తితో పాటు పి.రవిమారుత్, కమర్తపు మురళి, ఆర్.ఉదయ్‌కుమార్, ఎం.డీ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారికి పూజలు**

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని పలు డివిజన్లలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం జరిగిన పూజల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. 32వ డివిజన్ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో రథోత్సవానికి హాజరైన మంత్రి, 15వ డివిజన్ అల్లీపురంలో పూజలు చేయడమే కాక 10వ డివిజన్ పర్ణశాల రామాలయం వద్ద బతకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు రావూరి కరుణ, చావా మాధురి, కమర్తపు మురళితో పాటు మేళ్ల చెర్వు వెంకటేశ్వర్లు, బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సంక్రాంతి నాగేశ్వరరావు, సైదబాబు, నారాయణరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పెచ్చుమీరిన కాంగ్రెస్ నేతల దౌర్జన్యాలు

**ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు**



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాళ తదితరులు

ఖమ్మంవైరారోడ్: జిల్లాలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు పెచ్చుమీరిపోయాయని.. బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మండిపడ్డారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు వేధించడంతోనే తమ పార్టీ నాయకుడు బానోత్ రవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో కలిసి ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. జిల్లా మంత్రులు అభివృద్ధిపై దృష్టి సారించకుండా బీఆర్ఎస్ నాయకులను రాజకీయంగా అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని ఇబ్బంది పెట్టడం నిత్యకృత్యంగా మారిందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు రవిని వేధిస్తున్న వారిపై పోలీసులు ఇప్పటివరకు కేసు నమోదు చేయకపోవడం గర్హనీయమన్నారు. అయితే, అధికార పార్టీ నాయకులు పోలీసుల ద్వారా తమ శ్రేణులపై అణచివేతకు పాల్పడినా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగించడం తథ్యమని ఎంపీ, ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. నాయకులు ఉప్పల వెంకటరమణ, ఖమర్, బెల్లం వేణు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్న పోలీసులపై చర్యలు తీసుకుని, వేధింపులకు గురిచేస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని కోరారు.

# రెండో ప్రమాద హెచ్చరిక దాటి..



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- గోదావరిలో 49.70 అడుగులుగా నీటిమట్టం
- ఆందోళన చెందుతున్న రైతులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

భద్రాచలంటౌన్ : భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి వరకు మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగగా, మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు 48 అడుగులకు చేరడంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ తర్వాత గంటగంటకూ పెరుగుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు 50 అడుగులకు చేరింది. దీంతో అధికారుల అప్రమత్తమై నాలుగు చోట్ల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. వరద తీవ్రత ఇంకా పెరిగితే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**నిలిచిన రాకపోకలు..**

భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురం రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దసరా ఉత్సవాల నేపథ్యంలో భద్రాచలం వచ్చే భక్తులు స్నానాల కోసం గోదావరిలోకి దిగకుండా ఇనుప కంచె, ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు నీటిమట్టం 50 అడుగుల వద్ద నిలకడగా ఉంది. ఆ తర్వాత స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఎగువన పేరూరు వద్ద గోదావరి ప్రవాహం కొంతమేర తగ్గిందని, ఈ క్రమంలో భద్రాచలంలోనూ తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాత్రి 10 గంటలకు కాస్త తగ్గి 49.70 అడుగులుగా నమోదైంది.

**ముంపు బారిన పంటలు..**

గోదావరి నీటిమట్టం పెరుగుతుండడంతో పరీవాహక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. వారికి అక్టోబర్ ఎంతో విలువైంది. ఈ నెలలోనే పత్తి, వరి పంటలకు పాట్లు చేయడం సహా మిర్చి సాగు పనులు ప్రారంభిస్తారు. ఈ క్రమంలో వరద నీటితో పంటలు, మిర్చి సాగు చేసే భూములు ముంపునకు గురికావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరి, పత్తి రైతులకు ఈ వరదలు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, అశ్వాపురం, బూర్గంపాడు, మణుగూరుతో పాటు ఏపీలోని పలు మండలాల్లో ఇప్పటికే పంటలు ముంపునకు గురయ్యాయి.

## క్లుప్తంగా

### ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవలు అభినందనీయం



కలెక్టర్ అనుదీప్‌తో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

ఖమ్మం సహకారనగర్: వరదల వేళ జిల్లాలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కొనియాడారు. జిల్లాలో మూడునెలలుగా సేవలు అందించి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న బృందం సభ్యులు కలెక్టర్‌ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడునెలల పాటు బృందం జిల్లా యంత్రాంగానికి అండగా నిలిచిందని, చింతకానిలో వరద సమయాన నదిలో చిక్కుకున్న పలువురి ప్రాణాలను కాపాడారని తెలిపారు. అలాగే, ఆపద మిత్రులకు శిక్షణ ఇచ్చారని చెప్పారు.

### ఆలయ ఆర్చి నిర్మాణానికి రూ.1.60 లక్షల వితరణ



ఆర్చి వద్ద దాతలు

కల్లూరు: మండలంలోని పేరువంచలో శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఆర్చి నిర్మాణం కోసం అంకిరెడ్డి సుధీర్ కుమార్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు రూ.1.60లక్షల విరాళం అందజేశారు. ఆయన తల్లిదండ్రులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి – వరలక్ష్మి, సోదరుడు నరేష్‌రెడ్డి – స్వప్న ఈ నగదును ఆలయ కమిటీకి అందజేశారు. తాజాగా ఆర్చి నిర్మాణం పూర్తికావడంతో దాతలను ఆలయ చైర్మన్ వై.రంగారెడ్డి, వైస్ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి, వనుకూరు ప్రభాకర్‌రెడ్డి, కె.రవీందర్‌రెడ్డి అభినందించారు.

### ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులను మంగళవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సన్మానించారు. ఖమ్మంలోని కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ హోదాల్లో ఉద్యోగులు బాధ్యతాయుతంగా సేవలందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, ఐటీ కోర్ టీమ్ ఎస్సై పి.సత్యనారాయణ, వీఆర్ ఎస్సై వి.వెంకటేశ్వర్లు, సీఏఆర్ ఆర్ ఎస్సై ఎండీ.సలీమ్, ఏన్కూరు ఏఎస్సై జి.వెంకటేశ్వర్లు, సీఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కే.సయ్యద్ హుస్సేన్, ఖమ్మం సీపీఓ సీని యర్ అసిస్టెంట్ జి.కాంతి ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఆర్ ఐ కామరాజు, పోలీస్ ఉద్యోగుల అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**వైరా ఏసీపీకి సన్మానం**

వైరా: రెండున్నరేళ్లుగా వైరా ఏసీపీగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎం.ఏ.రెహమాన్ సేవలు మరువలేనివని పలువురు అధికారులు కొనియాడారు. వైరాలో మంగళవారం రెహమాన్ దంపతులను సన్మానించాక అదనపు డీసీపీలు ప్రసాదరావు, రామానుజం మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ పలు కేసుల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, డీసీఆర్‌బీ ఏసీపీ సాంబరాజు, సీసీఎస్ ఏసీపీ సర్వర్ పాషా, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల బంద్ నిర్ణయం వెనక్కి..

ఖమ్మం సహకారనగర్: కమీషన్ విడుదల చేయాలనే డిమాండ్‌తో రేషన్ డీలర్లు షాప్‌లను బంద్ చేయాలని నిర్ణయించగా ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఉన్నతాధికారులు రాష్ట్ర సంఘం బాధ్యులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యాన నిరసన, బంద్ ఆలోచన విరమించుకున్నట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానీమియా ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో బుధవారం నుంచి రేషన్ షాప్‌ల ద్వారా బియ్యం పంపిణీ జరగనుంది.

### హోటల్ నిర్వాహకులకు రూ.20వేల జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఓ ప్రముఖ హోటల్ నిర్వాహకులకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రూ.20వేల జరిమానా విధించారు. హోటల్‌లో మంగళవారం తనిఖీ చేయగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాక హోటల్‌లో అపరిశుభ్రంగా ఉండడంతో రూ.20వేల జరిమానా విధించామని కేఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య తెలిపారు.

**పామాయిల్ గెలలు**

| | |
|---|---|
| టన్ను ధర | రూ.19,107 |

# డైట్ బిల్లులకు మోక్షం ఎప్పుడో?

- నెలల తరబడి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం
- అప్పు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్న అధికారులు
- జిల్లా బకాయిలు రూ.11.94 కోట్లకు పైగానే..



సంక్షేమ వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు చదువుకునేలా ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ టిఫిన్, భోజనం కల్పనకు నెలనెలా తరగతి ఆధారంగా మెస్ చార్జీలతో పాటు సబ్బులు, నూనె, జుట్టు కత్తిరించుకునేందుకు కాస్మోటిక్ చార్జీల పేరిట చెల్లించాలి. కానీ ఈ బిల్లులు నెలనెలా మంజూరు కాకపోవడంతో విద్యార్థులే కాక సంక్షేమ అధికారులూ ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ వసతిగృహాలకు ఆరు నెలల నుండి ఎనిమిది నెలల బిల్లులు రాకపోవడంతో అప్పుచేసి మరీ సరుకులు తీసుకురావాల్సి వస్తుందని వార్డెన్లు వాపోతున్నారు. మరోపక్క సబ్బులు, నూనె లేక విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇక ఎస్సీ సంక్షేమశాఖలో పోస్టు మెట్రిక్ విద్యార్థులకు రూ.500 చొప్పున పాకెట్ మనీ కూడా అందడం లేదు.

**ఖర్చులు ఇలా..**

ప్రభుత్వం ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ వసతిగృహాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా బియ్యం సరఫరా చేస్తుంది. ఇతర సరుకుల కోసం మెస్ బిల్లులు ఇస్తుంది. ఈ డబ్బుతోనే వసతిగృహ సంక్షేమ అధికారులు( వార్డెన్లు) వంట గ్యాస్, గుడ్లు, పాలు కొనగోలు చేయడమే కాక అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు, వారానికి రెండు సార్లు చికెన్ సమకూర్చాలి. అయితే, గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ బాలికల వసతిగృహాలకు వీటి సరఫరా కోసం టెండర్లు నిర్వహిస్తున్నారు. కానీ వసతిగృహాల్లో ఆ పరిస్థితి లేక ప్రభుత్వం ఇచ్చే మెస్ బిల్లులతోనే వార్డెన్లు సరుకులు తెప్పించాల్సి వస్తోంది.

**నెలల తరబడి..**

ఎస్సీ, ఎస్టీ, బీసీ అభివృద్ధి శాఖల వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించే విషయంలో శక్తికి మించి శ్రమిస్తున్నామని సంక్షేమాధికారులు చెబుతున్నారు. అయినా డైట్ బిల్లులు నెలల తరబడి మంజూరు కావడం లేదని వాపోతున్నారు. ఫలితంగా అప్పు చేసి సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వెల్లడించారు. శాఖల వారీగా టెండర్లను పిలిచి పాలు, కూరగాయలు, పెరుగు, నిత్యావసరాలు సరఫరా చేయాల్సి ఉన్నా అధిక ధరలు, ఇతర కారణాలతో అమలు కావడం లేదు. ఫలితంగా సంక్షేమాధికారులే బిల్లులు వచ్చినప్పుడు తీసుకోవచ్చని ముందస్తుగా డబ్బు పెట్టి సరుకులు కొనుగోలు చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం సమకూరుస్తున్నారు. కానీ నెలల తరబడి బిల్లులు రాక అప్పుల పాలవుతుండగా.. ఇంకొందరు ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టి వడ్డీల భారం మోస్తున్నారు.

**బకాయలు రూ.కోట్లలోనే**

జిల్లాలో 52 ఎస్సీ, 31 బీసీ, 30 ఎస్టీ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం డైట్ చార్జీలను ఇస్తుంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డైట్ బడ్జెట్ పెంచింది. ప్రభుత్వం నిర్ణయించిన డైట్ చార్జీల ప్రకారం ప్రతీనెలా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు సుమారు రూ.1.50 కోట్లకు పైగా ఖర్చవుతోంది. కానీ ఈ బిల్లులను కొద్దినెలలుగా మంజూరు చేయకపోవడంతో సుమారు రూ. 11,94, 50,00కు పైగా బకాయి పేరుకుపోయింది.

**వారికి ఎనిమిది నెలలు..**

ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు డైట్ బిల్లులు రావాల్సి ఉండగా.. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి నుండి సెప్టెంబర్ వరకు పెండింగ్ ఉన్నాయి. గిరిజన సంక్షేమశాఖలో ఒక పక్కబిల్లులురాక విద్యార్థులకు భోజనం పెట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతుంటే, మరో పక్క డైలీవేజ్,ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెతో అధికా రులపై భారం పడుతోంది. ప్రస్తుతం వంట చేసేందుకు, ఇతర పనులకు వసతిగృహ సంక్షేమ అధికారు లే సొంత ఖర్చుతో కూలీలను సమకూర్చుకుంటున్నా రు. ఈ అంశంపై ఆయా శాఖల అధికారులను వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాగానే మెస్ చార్జీలు చెల్లిస్తామని వెల్లడించడం గమనార్హం.

**శాఖల వారీగా వివరాలు**

| | |
|---|---|
| **ఎస్సీ సంక్షేమశాఖ..** | |
| పోస్టు మెట్రిక్ వసతిగృహాలు | 11 |
| విద్యార్థుల సంఖ్య | 1,600 |
| ప్రీ మెట్రిక్ వసతిగృహాలు | 41 |
| విద్యార్థుల సంఖ్య | 3,100 |
| ఏప్రిల్ నుండి రావాల్సిన డైట్ చార్జీలు | రూ.3,74,02,500 |
| **బీసీ సంక్షేమశాఖ..** | |
| పోస్టు మెట్రిక్ వసతిగృహాలు | 11 |
| విద్యార్థుల సంఖ్య | 1,250 |
| ప్రీ మెట్రిక్ వసతిగృహాలు | 20 |
| విద్యార్థుల సంఖ్య | 1,700 |
| ఏప్రిల్ నుండి రావాల్సిన డైట్ చార్జీలు | రూ.2,49,47,500 |
| **గిరిజన సంక్షేమశాఖ..** | |
| పోస్టు మెట్రిక్ వసతిగృహాలు | 12 |
| జనరల్ వసతిగృహాలు | 08 |
| ఆశ్రమ పాఠశాలలు | 10 |
| మొత్తం విద్యార్థుల సంఖ్య | 4,500 |
| ఏప్రిల్ నుండి రావాల్సిన డైట్ చార్జీలు | రూ.5,71,00,000 |

# కొబ్బరికాయ ధరలకు రెక్కలు

**పండుగ వేళ రూ.40కి పైగానే విక్రయం**



కొబ్బరికాయల సైజ్ ఆధారంగా గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: కొబ్బరికాయల ధరలకు రెక్కలొచ్చాయి. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతుండడం, దసరా సమీపించిన నేపథ్యాన కొబ్బరి కాయలకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రాంతాలు, కాయ సైజు ఆధారంగా ఒక్కో కొబ్బరి కాయను రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. కార్పొరేట్ మాల్స్‌లో రూ.40 చొప్పున విక్రయిస్తుండగా, రిటైల్ దుకాణాల్లో రూ.45, గ్రామాల్లో రూ.50కి అమ్ముతున్నారు. అంతేకాక ఆలయాల వద్ద ఈ ధరలు మరింత ఎక్కువ ఉంటున్నాయి. నిన్నామొన్నటి వరకు వినియక చవితి ఉత్సవాలు సాగగా, ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతుండడం.. మరోపక్క భక్తులు భవానీ దీక్ష, అయ్యప్ప దీక్ష ధరిస్తుండడంతో కొబ్బరికాయలకు డిమాండ్ పెరిగింది. ఏపీలోని గోదావరి జిల్లాలు, కేరళ రాష్ట్రం నుంచి ఖమ్మంలోని హోల్‌సేల్ వ్యాపారులు దిగుమతి చేసుకుని సైజు ఆధారంగా గ్రేడింగ్ అనంతరం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు సరఫరా చేస్తున్నారు.

**దిగుబడి తగ్గడంతో..**

కొబ్బరి పంట దిగుబడి ఆశించిన మేర లేకపోవడంతోనే డిమాండ్ పెరిగిందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. దీనికి తోడు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వినియోగం పెరగడం ఇంకో కారణంగా చెబుతున్నారు. గోదావరి జిల్లాలు, కేరళ రాష్ట్రానికిఆర్డర్ చేసినా సమయానికి రావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

# గురుకుల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

**అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



పాఠశాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్: మండలంలోని లక్ష్మీపురంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించిన ఆయన మ్యాప్ ఆధారంగా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అద్భుతమైన మేధస్సుతో కూడిన మానవ వనరులను అందించడమే యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల లక్ష్యమన్నారు. గ్రామీణ విద్యార్థులకు అత్యున్నత విద్యనందించనున్న గురుకుల భవన నిర్మాణంలో రాజీ పడకుండా పూర్తిచేయాలని సూచించారు. తరగతి, వసతి గదులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది క్వార్టర్లు మార్చిలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



వరి పొలంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వైరా: చింతకాని మండలంలోని కొదుమూరులో పలువురు రైతులు సాగుచేసిన వరి, పత్తి పంటలను మధిర వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. వరుస వర్షాలతో పంటలను తెగుళ్ల ఆశించిన పరిశీలించిన వారు యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు. పత్తిలో వడ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి మొక్క మొదళ్ల చుట్టూ పిచికారీ చేయాలని సూచించారు. అలాగే అల్టేరియా, ఆకుమచ్చ తెగులు, కొమ్మ ఎండు తెగులు, కాయకుళ్లు తెగులు నివారణ చర్యలను వివరించారు. అంతేకాక వరిలో ఆకుల మీద తుప్పు మచ్చలకు జింక్‌లోపం కారణమని నిర్ధారించారు. పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి, వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరిత, శాస్త్రవేత్తలు కె.నాగస్వాతి, ఫణిశ్రీ పాల్గొన్నారు.

# అవగాహన సదస్సులో ఏపీఓ జనరల్

**హిమాచల్‌ప్రదేశ్ వెళ్లివచ్చిన డేవిడ్‌రాజ్**



సదస్సులో మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన నిషేధిత మత్తు పదార్థాలపై అవగాహన సదస్సుకు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ హాజరయ్యారు. శిక్షణ అనంతరం భద్రాచలం వచ్చిన ఆయన మంగళవారం వివరాలు వెల్లడించారు. గిరిజన యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కల్పించారని, రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణ అధికారి నిఖిల, తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రతిపాదన మేరకు సదస్సులో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. త్వరలో మారుమూల ఆదివాసీ గ్రామాల్లో యువకులకు ప్రత్యేక శిక్షణ అందించేలా ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధం కండి

**సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: స్థానిక ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో పార్టీ ఖమ్మం డివిజన్ రఘునాథపాలెం మండల ముఖ్య నాయకులు, పాలేరు డివిజన్ కమిటీ నాయకులతో మంగళవాం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ప్రజలకు దగ్గరకు ఉండే వారికే విజయం దక్కనున్నందున పార్టీ శ్రేణులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని తెలిపారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం అనేక పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. ఈనేపథ్యాన సీపీఎం అభ్యర్థులకు ప్రజల మద్దతు కచ్చితంగా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశాల్లో ఖమ్మం, పాలేరు డివిజన్లు, రఘునాథపాలెం మండల కార్యదర్శి వై.విక్రమ్, బండి రమేష్, ఎస్.నవీన్‌రెడ్డి, నాయకులు సభ్యురాలు బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు, ఎస్.నవీన్‌రెడ్డి, మహమ్మద్ జబ్బార్, బానోతు నాగేశ్వరరావు, నాగయ్య, షేక్ ఇమామ్, గుగులోత్ కుమార్, కూచిపూడి నరేష్ పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సింగరేణి(కొత్తగూడెం): సైబర్ నేరాల పట్ల సింగరేణి ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో సూచించారు. కార్మికులకు దసరా అడ్వాన్స్, లాభాల బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేశామని, త్వరలో దీపావళి బోనస్ కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తారని, అలాంటి వారి మాటలు నమ్మి అకౌంట్ నంబర్లు, ఓటీపీలు చెప్పొద్దని కోరారు.

**షేర్ హోల్డర్ల సమావేశం**

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షతన మంగళవారం కంపెనీ షేర్ హోల్డర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లాభాలు, వ్యయం, నూతన ప్రాజెక్టులు, షేర్ హోల్డర్లకు డివిడెంట్ల కేటాయింపు, సీఎస్సార్ ఫండ్ కేటాయింపులపై చర్చ జరిగినట్లు సమాచారం. షేర్ హోల్డర్లు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు.

# స్థానిక సమరంలో సత్తా చాటుదాం

**సీపీఐ జిల్లా సమితి సమావేశంలో బాగం**





సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: స్థానిక సమరంలో సత్తా చాటేలా పార్టీ నాయకత్వం, కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ఎన్నికలు జరుగుతాయా, లేదా అన్న మీమాంసను పక్కనపెట్టి అభ్యర్థుల ఎంపికలో నిమగ్నం కావాలని సూచించారు. సీపీఐ జిల్లా సమితి సమావేశం మంగళవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఏపూరి లతాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను సీపీఐ స్వాగతిస్తుండగా, రిజర్వేషన్లకు అనుగుణంగా పనిచేయడంతో పాటు కలిసొచ్చే రాజకీయ పార్టీలతో కలిసి సంప్రదింపులు జరపాలని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు నాయకత్వంతో సంప్రదిస్తూ అభ్యర్థులను ఎంపిక చేయాని సూచించారు. కాగా, పార్టీ శతజయంతి ఉత్సవ ముగింపు సభ డిసెంబర్ 26న జరగనుండగా, ఈనెల 5న ఖమ్మంలో ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికతో పాటు జిల్లాలో పోటీ చేయాల్సిన స్థానాల వివరాలను ప్రవేశపెట్టారు. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు మధిరకు డిప్యూటీ సీఎం

మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాత్రి మధిరకు రానున్నారు. విజయదశమి పండుగ సందర్భంగా ఆయన మధిర రానుండగా, గురువారం ఇక్కడే కుటుంబ సభ్యులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొంటారు. అంతేకాక మరికొన్ని కార్యక్రమాల్లో కూడా డిప్యూటీ సీఎం పాల్గొనే అవకాశముందని తెలిసింది.

### బావిలో పడి వ్యక్తి మృతి



కూలీ మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ దాల్‌మిల్లులో దిన సరికూలీగా పనిచేస్తున్న వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు బావిలో పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు లేదా హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాలకు చెందిన 60ఏళ్ల వ్యక్తి పేరు కృష్ణగా తెలుస్తోంది. ఆయనమంగళవారం దాల్‌మిల్లులో కూలీకి వెళ్లగా అక్కడి బావిలో కాలుజారి పడ్డాడు. దీంతో తోటి కూలీలు బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చగా, ఆయన ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని ఖమ్మం త్రీటౌన్ పోలీసులు సూచించారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి ..

కామేపల్లి: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతిచెందాడు. మండలంలోనిని గరిడేపల్లికి చెందిన మాలోత్ నవీన్(25) ఇంటి చుట్టూ రేకులతో వేసిన ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈక్రమాన సోమవారం రాత్రి ఫ్యాన్‌కు అమర్చిన కరెంట్ వైరు తెగి రేకులకు తాకింది. ఆపై నవీన్ ప్రమాదవశాత్తు రేకులను తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన భార్య నందిని ఫిర్యాదుతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

### ట్రాక్టర్ కిందపడి యువకుడు..

నేలకొండపల్లి: రెండు బైక్‌లు ఢీకొనగా కింద పడిన వ్యక్తి పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన ఇది. మండలంలోని కోనాయిగూడెంకు చెందిన సుతారీ మేస్త్రీ కొచ్చెర్ల బాలకృష్ణ(35) రోజుమాదిరిగానే మంగళవారం పనికి వెళ్లి రాత్రి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. రాజేశ్వరపురం సాగర్ కాల్వ సమీపాన నేలకొండపల్లి నుంచి కూసుమంచి వెళ్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బాలకృష్ణ రోడ్డుపై పడగా వెనక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఆయన పైనుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### 17 ఏళ్ల బాలుడు అదృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లికి చెందిన 17ఏళ్ల బాలుడు కానరాకుండా పోయాడు. టేకులపల్లికి చెందిన బొడ్డు రామకృష్ణ కుమారుడు భవానీప్రసాద్ సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

# 205 కేజీల గంజాయి పట్టివేత

**ఒకరు అరెస్ట్, ముగ్గురిపై కేసు**



నిందితుడు, గంజాయిని చూపుతున్న పోలీసులు

బూర్గంపాడు: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని మండలంలోని మోరంపల్లిబంజర వద్ద సోమవారం ఎస్‌ఐ ప్రసాద్ పట్టుకున్నారు. మంగళవారం పాల్వంచ సీఐ సతీశ్ వివరాలు వెల్లడించారు. హరియాణాలోని కురుక్షేత్రకు చెందిన కారు డ్రైవర్ సంజీవకుమార్ తన ఓనర్ ప్రిన్స్‌కుమార్ ఆదేశాల మేరకు చింతూరుకు వచ్చి, ప్రధాన్ కారా, లఖన్ హంతాల్ వద్ద 205 కేజీల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని తన రాష్ట్రానికి తరలిస్తూ మార్గమధ్యలో మోరంపల్లిబంజర వద్ద పోలీసులు పట్టుకున్నారు. గంజాయి, కారును స్వాధీనం చేసుకుని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ రవాణాకు సంబంధించి కారు ఓనర్ ప్రిన్స్‌కుమార్, గంజాయి అమ్మిన ప్రధాన్ కారా, లఖన్ హంతాల్‌పై కేసు నమోదు చేశామని, సంజీవకుమార్‌ను అరెస్ట్ చేశామని సీఐ వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.02 కోట్లు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### ఐటీడీఏ డీడీగా అశోక్



అశోక్‌ను అభినందిస్తున్న కార్యాలయ ఉద్యోగులు

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏలోని విద్యాశాఖ విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీగా(పూర్తి అదనపు బాధ్యతలు) జి.అశోక్‌కు పీఓ రాహుల్ అప్పగించారు. ఈమేరకు ఆయన మంగళవారం డీడీ మణెమ్మ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అశోక్ ప్రస్తుతం ఏటీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.